గౌరీ తనయ.. మా బొజ్జ గణపయ్య

గౌరీ తనయుడు.. బొజ్జ గణపయ్య చవితి ఉత్సవాలు అంగరంగ వైభవంగా మొదలయ్యాయి. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా యువత, చిన్నపిల్లలు, మహిళలు, పెద్దలు ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ముందుగా ప్రతిష్ఠాత ప్రాంతాల్లో వేదికలను దేదీప్యమానంగా అలంకరించి, స్వామి వారి విగ్రహాన్ని కొలువుదీర్చి, పూజలు నిర్వహించారు. అనంతరం వినాయక వ్రతం ఆచరించారు. వివిధ ప్రాంతాల్లో కొలువుదీరిన గణనాథులను ప్రజాప్రతినిధులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి రాజంపేటలో, చిన్నమండెంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌లు ఉత్సవ విగ్రహాలను దర్శించి, పూజలు చేయించారు. వివిధ రూపాల్లో దర్శనమిస్తున్న గణనాథులను దర్శించుకోవడానికి ప్రజలు పెద్దసంఖ్యలో వస్తున్నారు. దీంతో అన్ని చోట్ల ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడుతోంది. ఉత్సవాలు జరుగుతున్న చోట సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. వచ్చిన భక్తులకు నిర్వాహకులు అన్నప్రసాదాలను అందించారు.

– సాక్షి, నెట్‌వర్క్



రాజంపేట రూరల్: విఘ్నేశ్వరుడికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, భక్తులు



గాలివీడు: శెట్టివారిపల్లెలో కొలువుదీరిన గౌరీ తనయుడు



సుండుపల్లె: ప్రత్యేక అలంకారంలో గణనాథుడు



రాజంపేట టౌన్: మట్టి గణపయ్యకు వీడ్కోలు పలుకుతున్న మహిళలు



వీరబల్లి: బస్టాండ్ కూడలిలో



రైల్వేకోడూరు అర్బన్: రాఘవరాజపురంలో వినాయకుడి విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, నాయకులు



రాజంపేట టౌన్: వినాయక చవితి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆకేపాటి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులు



లక్కిరెడ్డిపల్లె: ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి



చిట్వేలి: సింగనమల వీధిలో గణనాథుని పూజల్లో ఎమ్మెల్యే అరవ శ్రీధర్



చిన్నమండెం: బోరెడ్డిగారిపల్లెలో కుటుంబ సమేతంగా వినాయకుడికి పూజలు నిర్వహిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



రాజంపేట టౌన్: కోలాటం ఆడుతున్న మహిళలు



రామాపురం: వినాయకుడికి పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి



పుల్లంపేట: ప్రత్యేక అలంకారంలో దర్శనమిస్తున్న లంబోదరుడు



పెనగలూరు: కొత్తపల్లిలో వినాయకుడికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



సంబేపల్లె: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో పూజలందుకుంటున్న గణనాథుడు



రాజంపేట: నాగిరెడ్డిపల్లె అర్బన్‌లోని ఇసుకపల్లెలో పూజలందుకున్న 12 అడుగుల గణేశుడి విగ్రహం



సిద్దవటం: పెద్దపల్లి పంచాయతీ భాకరాపేటలో పూజల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు



రైల్వేకోడూరు అర్బన్: రంగనాయకులపేటలో కొలువైన పంచముఖ గణేశుడి భారీ విగ్రహం

క్లుప్తంగా

నిమజ్జనంలో జాగ్రత్తలు పాటించండి



ఎస్‌ఐ పి.మహేష్

ఓబులవారిపల్లె : వినాయక నిమజ్జనం సందర్భంగా మద్యం సేవించి నిమజ్జనం చేయడం నిషేధమని ఎస్‌ఐ పి.మహేష్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వినాయక నిమజ్జనం సందర్భంగా జాగ్రత్తలు పాటించాలని, గ్రామోత్సవంలో విద్యుత్ తీగలు పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి గొడవలు జరిగినా సంబంధిత కమిటీలు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. మంగంపేట గోవిందంపల్లెలో ఏపీఎండీసీ సహకారంతో నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ట్రాక్టర్లలో మద్యం సేవించి నిమజ్జనం వద్దకు రాకూడదని, అలాగే చిన్న పిల్లలను కార్యక్రమానికి తీసుకురావద్దన్నారు. నిమజ్జన కార్యక్రమంలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు.

వెలిగల్లులో నిమజ్జనాల నిషేధంపై హర్షం

రాయచోటి టౌన్ : వెలిగల్లు జలాశయంలో వినాయకుడి నిమజ్జనం నిషేధించడం హర్షించదగ్గ విషయమని దీనిని స్వాగతిస్తున్నట్లు రాయచోటి మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ మాజీ సభ్యులు యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి చెప్పారు. తాగునీటి జలాశయంలో నిమజ్జనం చేయడం వలన నీటికాలుష్యం పెరుగుతుందన్నారు. తద్వారా ప్రజలు అనారోగ్యానికి లోనవుతారన్నారు. అయితే భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా దీనికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు.

వరద సహాయక చర్యల్లో పారిశుధ్య సిబ్బంది



అజిత్‌సింగ్‌నగర్‌లో పారిశుధ్య పనులు చేస్తున్న రాయచోటి మున్సిపల్ కార్మికులు

రాయచోటి అర్బన్ : విజయవాడలో సంభవించిన వరదలతో విలవిలలాడుతున్న ప్రజలకు అందిస్తున్న వరద సహాయక చర్యలలో రాయచోటికి చెందిన మున్సిపల్ అధికారులు, పారిశుధ్య కార్మికులు పాల్పంచుకున్నారు. మున్సిపల్ కమిషనర్ వాసుబాబు, ఆర్‌ఐ మల్లికార్జునలు 16వ డివిజన్ భూపేష్‌గుప్తా నగర్, 59వ డివిజన్ అజిత్‌సింగ్‌నగర్, గంగాలమ్మ గుడి దగ్గర సహాయక చర్యల్లో పాల్గొన్నారు. పారిశుధ్య కార్మికులు నిలువ ఉన్న నీటిని తొలగించడం, వీధుల్లోని చెత్తాచెదారాన్ని తొలగించడం లాంటి పనులు చేపడుతున్నారు.

ఆలయానికి వెండి పళ్లెం వితరణ



వెండి పళ్లెం అందజేస్తున్న దాత

నందలూరు : నాగిరెడ్డిపల్లి గ్రామంలో వెలసిన కన్యకాపరమేశ్వరి దేవి ఆలయానికి రాజంపేటకు చెందిన రమేష్ బాబు ఆయన సతీమణి కీ.శేలు సుప్రజ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు ఆలయానికి 650 గ్రాముల వెండి పళ్లెం ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు ఎంబలూరు నరసింహ శెట్టి, ఆలయ మాజీ అధ్యక్షులు గెలివి మల్లికార్జున శెట్టి, మేడా వెంకటకుమార్, ఎంబలూరు నరసింహ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

వీరబల్లి : మండలంలోని సానిపాయి పంచాయతీలో ఆ గ్రామ సర్పంచ్ నేతి ఆంజనేయులు ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భంగా శనివారం పేదలకు బట్టలు పంపిణీ చేశారు. అలానే తన కుమారుడు చంద్రబాబుకు ఇటీవలే వివాహం జరిగింది. దీంతో వారు 500 మంది పేదలకు బట్టలు పంపిణీ చేసినట్లు తెలిపారు. అలాగే కార్యక్రమానికి హాజరైన పేదలకు అన్నదానం ఏర్పాటు చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

వీరబల్లి : మండలంలోని వంగిమళ్ల పెద్ద హరిజనవాడలో, రాగిమాను దిన్నెపల్లెలో పేకాట ఆడుతున్న వారిని పోలీసులు అరెస్టు చేశారు. పక్కా సమాచారంతో ఎస్‌ఐ మోహన్‌నాయక్ తన సిబ్బందితో వెళ్లి అరెస్టు చేసి వారివద్ద నుంచి రూ. 4,400లు నగదును స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఆయన తెలిపారు.

19 మద్యం బాటిళ్లు స్వాధీనం

మండలంలోని సంఘంవాండ్లపల్లి పంచాయతీ ఎలక చెట్టుపల్లెలో ముగ్గురు వ్యక్తుల నుంచి 19 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలియజేశారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆలోచన దుర్మార్గం



రాస్తారోకో కరపత్రాలను విడుదల చేస్తున్న కార్మిక, రైతు సంఘాల నేతలు

రాయచోటి అర్బన్ : విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆలోచన దుర్మార్గమని కార్మిక, రైతు సంఘాల నేతలు అన్నారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ చిత్రపటం వద్ద విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ ఈ నెల 10న నిర్వహింప తలపెట్టిన రాస్తారోకో కరపత్రాలను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వి.రంగారెడ్డిలు మాట్లాడుతూ కేంద్రంలో 3వ సారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ఒక ఆంధ్రప్రదేశ్‌లోని స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయడానికి ప్రయత్నిస్తుండడం వెనుక అంతర్యం ఏమిటంటూ వారు ప్రశ్నించారు. కొత్తగా పరిశ్రమలు ఏర్పాటు చేయించి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సిన పాలకులు ఉన్న ఉక్కు పరిశ్రమను మూసివేసే ప్రయత్నాలు చేస్తుండడం దారుణమంటూ మండిపడ్డారు. ప్లాంట్ ప్రైవేటీకరణ యోచనను పాలకులు వెంటనే మానుకోవాలన్న డిమాండ్‌తో ఈనెల 10న నిర్వహింప తలపెట్టిన రాస్తారోకోను ప్రజలు విజయవంతం చేయాలంటూ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కార్మిక నేతలు హరిశర్మ, భాగ్యలక్ష్మి, ఎ.వి.రమణ, నాగబసిరెడ్డి, బి.వి.రమణ, ఎస్. శ్రీనివాసులు, విజయమ్మ, మాధవయ్య తదితరులు పాల్గొన్నారు.

చెత్తాచెదారాలు తొలగించండి



పేరుకుపోయిన చెత్తాచెదారాలను చూపిస్తున్న కడపాయపల్లె ఎస్సీ కాలనీ వాసులు

సిద్దవటం : కడపాయపల్లెలోని ఎస్సీ కాలనీలో పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో గ్రామస్తులు రోగాలు బారిన పడుతున్నారు. పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి తమ ఆరోగ్యాలకు దోహదపడాలంటూ విన్నవిస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆదివారం మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు రహదారిలో దిబ్బలు, ప్లాస్టిక్ వంటి వ్యర్థ పదార్థాలు పేరుకుపోయాయన్నారు. అంతే గాకుండా పెన్నానది పరివాహక ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు వరద నీటితో పెన్నా ఉరకలేస్తూ ప్రవహిస్తుండటంతో గ్రామంలో అపరిశుభ్రత కారణంగా దోమలు ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. దీంతో విషజ్వరాలు ప్రబలుతున్నాయని గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారన్నారు. అధికారుల స్పందించి మా కాలనీలో ఉన్న అపరిశుభ్రతను తొలగించాలని కోరుతున్నారు. ఈ విషయమై గ్రామ పంచాయతీ కార్యదర్శి సుదర్శన్ రెడ్డిని వివరణ కోరగా గ్రామంలో వినాయక చవితి ఉత్సవాలు ముగిసిన వెంటనే ఆ ప్రాంతాలను పరిశీలించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

వినాయక స్వామికి వెండి కిరీటం బహూకరణ



వెండి కిరీటంను తీసుకువస్తున్న వీరారెడ్డి దంపతులు

పెనగలూరు : మండల కేంద్రం పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో వెలసివున్న వినాయకస్వామికి వెండి కిరీటాన్ని దువ్వూరు వీరారెడ్డి దంపతులు బహూకరించారు. కిరీటంతోపాటు చెవులకు, తొండానికి వెండి వస్తువులు అందజేశారు. రూ.2.5 లక్షలు విలువజేసే వెండి వస్తువులను ఆలయానికి అందజేశారు. 100 కేజీల లడ్డును పథకమూరు యానాది నాయుడు దంపతులు స్వామివారికి అందజేశారు.

సిమెంట్ రోడ్డు నిర్మించండి



అధ్వానంగా ఉన్న రోడ్డును చూపిస్తున్న స్థానికుడు పద్మనాభయ్య

పుల్లంపేట : మండల పరిధిలోని సీతారాంపేట గ్రామంలో ఓ వీధిలో సిమెంట్ రోడ్డు లేకపోవడంతో రోడ్డు గుంతలమయంగా మారింది. ఈ రోడ్డుపై నడవడానికి వృద్ధులు అవస్థలు పడుతున్నారు. ఈ వీధిగుండా నడవాలంటే ఎక్కడ జారిపడి ప్రమాదానికి గురవుతామోనని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని ఆ వీధిలోని శ్రీరామదాసు పద్మనాభయ్య వాపోయాడు. వర్షం వస్తే చాలు రోడ్డంతా బురదమయం నీటితో నిండిపోవడంతో ప్రజలు పలు అవస్థలు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి సిమెంట్ రోడ్డును ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఉచిత వైద్య సేవలు అభినందనీయం

గాలివీడు : మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో తిరుపతికి శ్రీ వెంకటేశ్వర అరవింద్ ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని చిన్నమండెం మానవత చైర్మన్ ఎం.రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వైద్య శిబిరానికి 200 మంది హాజరయ్యారు. వైద్య పరీక్షల అనంతరం అందులో 41 మందికి కంటి ఆపరేషన్ అవసరమని గుర్తించి వారిని తిరుపతి అరవింద్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మానవత గాలివీడు చైర్మన్ సుబ్బిరెడ్డి, కన్వీనర్ శివారెడ్డి, చెంగల్‌రాజు, రామకృష్ణారెడ్డి, డాక్టర్ శంకర్, రమణారెడ్డి, సుబ్బరాయుడు, వెంకటేశ్వర్లు, సాయి, హీరా, వెంకట్రామిరెడ్డి, మనోహర్‌రెడ్డి, చంద్రారెడ్డి, దామోదర్, డాక్టర్ నరసింహులు, డాక్టర్ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

రెడ్డెమ్మకొండపై భక్తుల రద్దీ

గుర్రంకొండ : చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయం వద్ద ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయాన్నే పలు రకాల నైవేద్యాలు సమర్పించి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు అమ్మవారి కోనేట్లో పవిత్ర స్నానమాచరించి సంతానం కోసం వరపడ్డారు. కోర్కెలు తీరిన వారు అమ్మవారికి మొక్కులు చెల్లించుకొన్నారు.